# స్థానభ్రంశం

ద్విభాష్యం రాజేశ్వరరావు

నిన్న ముప్ఫయి!

ఈవేళ ముప్ఫయ్యొకటి!

రేపు ఒకటి!

రేపటికి సరిగ్గా నాలుగు నెలలవుతుంది - తనకూ, దేవకికీ అనుబంధం తెగిపోయి!

దేవకి - ఆమె జ్ఞప్తికి వస్తే మల్లె మొగ్గల పరిమళాలు, లేత చెక్కిళ్ళమీద 'ఇంటిమేట్ సెంటు' వాసన, మెడల వంపుల మధ్య దాగి మత్తెక్కించే 'ఉడుకులోన్' తీయని స్పర్శ, వెన్నెల రాత్రులు - ఎన్నో జ్ఞప్తికి వస్తాయి సారథికి!

దేవకి మీద ఈవేళ్టికీ తనకు కోపం లేదు. జాలితప్ప

సిగరెట్టు ముట్టించేడు సారథి - 'మార్ల్బరో' ఘాటు గొంతును తినేస్తోంది.

ఈ నాలుగు నెలలుగా ఇది కొత్త అలవాటు - ఏ సిగరెట్టు దొరికితే అది కాల్చటం - అరగంట క్రితం 'షిప్ కేప్టెన్' గదిలోకి వెళ్తే సిగరెట్ ఆఫర్ చేశాడు. దాన్ని అప్పుడు కాల్చలేదు, జేబులో వుండిపోయింది, ఇప్పుడు అక్కరకు వచ్చింది. పొగ గట్టిగా పీల్చి వదిలేడు.

దేవకిని గురించిన ఆలోచనలనుండి తప్పించుకోటం అసాధ్యంలా కనుపించింది సారథికి! ఇంట్లో వుంటే సరే సరి - ఒంటరితనం - వెర్రెత్తించే జ్ఞాపకాలు - డ్యూటీలో వున్నా అంతే - పదిమంది మధ్య తిరుగుతున్నా, ఆలోచనలు ఎప్పుడూ వంటరివేకదా!

పనిలో తల దూర్చాలన్నా సాధ్యం కావటంలేదు.



వెనుక పెద్ద శబ్దమయితే, తిరిగి చూసేడు సారథి!

'గేంట్రీ' పని ప్రారంభించింది. 'షిప్ డెక్' మీదనుండి కదిలి 'హేచ్' వైపుకు వెళ్ళేడు. లోనికి తొంగి చూశాడు, సగానికి పైగా 'ఫాస్ఫేటు ఇసుక' లోపల వుంది!

రేపు మధ్యాహ్నానికి కాని 'అన్ లోడింగు' పూర్తి అయ్యేలా లేదు.

రాక్షసిలా నోరు తెరుచుకున్న 'గేంట్రి బకెట్' కడుపునిండా ఇసుక నింపుకుని మళ్ళీ నోరు మూసుకుని మెత్తని శబ్దంతో పైకిలేచింది.

'రోప్‌వే' మీద నిశ్శబ్దంగా కదలి 'కన్వేయరు బెల్టు' మీద నోరు విప్పి ఇసుకను వంపేసింది. మళ్ళీ వెనక్కు వచ్చి ఇసుకను నోట కరుచుకుంటోంది.

ఓడ 'డెక్' మీది తెల్లని పాల దీపాలు రాత్రిని పగలుగా మార్చేస్తున్నాయి. ఈ తెల్ల దీపాలముందు 'బెర్తు' మీది దీపాలు వెలవెలబోతున్నాయి. నల్లని 'కన్వేయరు బెల్టు' మీద తెల్లగా మెరుస్తూ ఫాస్ఫేటు ఇసుక పాములా ముందుకు సాగిపోయి సిమ్మెంటు టేంకులో పడిపోతోంది. అక్కడనుండి ఎరువుల ఫ్యాక్టరీకి రవాణా అయిపోతుంది. 'బాల్ మిల్లు'లో ఇనుప గుళ్ళ మధ్యపడి నలిగి నుసి అయిపోయి 'ఫాస్ఫారిక్ ఆసిడ్ రియాక్టరు' లోకి జారిపోయి అక్కడ 'సల్ఫ్యూరిక్ ఆసిడ్'తో రియాక్షన్ పొందుతుంది. తరువాత 'ఫిల్టరు' మీద వడగట్టబడి

మిగిలిపోయిన 'జిప్సమ్' ముద్దలా విడి పోతుంది.

ఎక్కడ పుట్టిందో ఈ ఇసుక! ఎక్కడికి చేరుకుంటోంది!

ఈ ఇసుక ఏ అమెజాన్ నదీ సైకతాల్లోనిదో! దప్పికతో నీళ్ళు త్రాగటానికి ఎన్నెన్ని మృగాలు ఈ ఇసుక మీద తిరుగాడాయో! పక్షుల లేత అడుగుజాడలు ఎన్ని ఈ ఇసుకమీద పడి చెదిరిపోయాయో! ఎన్ని ప్రేమ జంటలు ఈ ఇసుకమీద కూర్చొని కబుర్లు చెప్పుకున్నాయో! ఎన్ని మానవ కంకాళాలు నదీ ప్రవాహంలో కొట్టుకొచ్చి ఒడ్డునపడి, ఎండి, శిథిలమై ఈ ఇసుకలో కలిసిపోయాయో! ఎక్కడో పుట్టి స్థానభ్రంశం పొంది ఇక్కడకు వచ్చింది. సల్ఫ్యూరిక్ ఆసిడ్‌తో రసాయనికంగా మార్పుపొంది 'జిప్సమ్'గా మళ్ళీ స్థానభ్రంశం!

చిన్నతనంలో చదివిన 'కెమిస్ట్రీ' పాఠం గుర్తుకొచ్చింది సారథికి.

రెండు మూలకములు రసాయనికముగా కలిసి మార్పులు పొందటంలో 'స్థానభ్రంశం'. ఒకరకం! అంటే, ఈ విధానంలో ఒక మూలకం మరో మూలకాన్ని త్రోసిరాజని దానిస్థానం ఆక్రమించుకుంటుంది.

దేవకి తనను త్రోసి రాజంది!

రాజుతో వెళ్ళిపోయింది!

దేవకి స్థానభ్రంశం పొందింది!

'నరులు, నఖములు, కేశములు స్థానభ్రంశము పొందెనేని రాణింపరు' అంటాడు చిన్నయసూరి. దేవకి కేశాలు ఎంత బావుంటాయి!

ఎంత పొడవయిన కురులు! తలంటు పోసుకుని గాలికి ఆరబెట్టుకుని వదులుగా రిబ్బనుతో ముడివేసుకుంటే - పిరుదులు దాటి మోకాళ్ళవరకూ వేళ్ళాడుతూ గాలికి ఇటూ అటూ ఊగుతూ - ఎంత ఠీవిగా వుంటుందా జడ!

ఆ నల్లని త్రాచుపాములాటి జడే కదూ, ముందు తనకు దేవకిని పరిచయం చేసింది!

హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో పై బెర్తు మీద దేవకి! మధ్య బెర్తుమీద తను అప్పటికి తనకూ, దేవకికీ పరిచయం లేదు. నిద్రలో ఒత్తిగిల్లితే ఆమె నిడువయిన జడ పాములా జారి తన ముఖం ప్రక్కగా పడితే, ఆ కురుల పరిమళం అనాడే తనను కట్టిపడేసింది. చొరవచేసి ఆ జడను తన బుగ్గల క్రింద ఇరికించుకుని ఏమీ తెలియనట్లు నిద్రపోయేడు. మరునటి ఉదయం దేవకి సుతారంగా జడను లాక్కుంటూ వుంటే తెలివొచ్చింది తనకు! నిద్ర 'డిస్టర్బ్' చేసినందులకు దేవకి క్షమాపణలు చెప్పుకుంది. అదే మొదటి పరిచయం. తరువాత ఒక సంవత్సరంలోనే ఆ పరిచయం తమ వివాహానికి దారితీసింది.

దేవకిని తాను ఎంత గాఢంగా ప్రేమించేడు!

నీకూ, నాకూ మధ్య నిశీధి అంటూ నల్లని కురుల్ని ముఖంమీద పల్చగా కప్పేసుకుని తన గుండెలమీద ఆమె తల వాల్చినప్పుడు - నల్లని మబ్బుల్లా కమ్ముకున్న కురుల్ని సుతారంగా వేళ్ళతో తొలగించి చందమామలాంటి దేవకి ముఖాన్ని ఎంత ఆప్యాయంగా తిలకించేవాడు తను!!

గుండ్రని ముఖం, నుదుటన దోస గింజలా తిలకంబొట్టు, చెవులకు ఎర్రని రాళ్ళ దుద్దులు - మబ్బు పట్టిన ఆకాశం లోంచి తొంగిచూస్తూ కన్నుగీటే నక్షత్రాల్లా!

అజంతా చిత్రాల్లోని సుందరులను తాను చూడలేదు. కాని ఆ చిత్తరువుల్లోని సుందరులు దేవకి అంత అందంగా వుండరు. కేవలం ఆకృతిలోని అందం ఎవడికి కావాలి? నవ్వినపుడు ముత్యాలు దొర్లి పోయినట్లుండే పలువరుస - గులాబీచెక్కిళ్ళమీద బుల్లి బుల్లి సొట్టలు - మెల్లగా వీణ తీగెల్ని లాగి వదిలేస్తే కలిగే ప్రకంపనంలాటి చిరునవ్వు - ఏ అజంతా చిత్రాలు చూపగలవు?

"సార్"

"...."

"సార్!"

"ఆ! ఏమిటి?" ఉలిక్కిపడ్డాడు సారథి.

"'షిప్' బాగా పైకి తేలిపోయింది. 'గేంట్రీ మూవ్‌మెంటు' కష్టంగా వుందం టున్నాడు ఆపరేటరు." హెల్పరు శివయ్య వచ్చి చెప్పేడు.

"ఛీఫ్ ఆఫీసరుతో మాట్లాడి 'బేలెస్టింగ్' చేయిస్తానులే!" అంటూ కాబిన్ వైపు కదిలేడు సారథి.

ఆకాశంలో వెన్నెల గుమ్మడి పువ్వుల్ని తుంపి ఆరబెట్టినట్లుంది. 'వెన్నెలను చూస్తే సముద్రానికి ఆరాటం హెచ్చవుతుందట!' సారథికి నవ్వొచ్చింది.

ఈవేళ పౌర్ణమి. పోటు హెచ్చుగా వుంటుంది. సముద్రపు కాలువలో, అంటే ఈ బెర్త్ దగ్గర నీటిమట్టం పెరుగుతుంది. నీటిమట్టంతోబాటు ఓడ కూడా పైకిలేస్తుంది. ఓడ తేలి, పైకి లేస్తున్నకొద్దీ 'గేంట్రీ'కి 'ఆపరేషన్' కష్టమయిపోతుంది. అందుకే 'బేలెస్టింగ్' చెయ్యాలి. అంటే, షిప్‌లోకి నీళ్ళు నింపి ఆ బరువుకు లోతుకు మునిగేటట్లు చేయాలి. సముద్రపు ఆటు పోటులనను సరించి ఈ బాధలు తప్పవు.

కేబిన్ తలుపులు తెరుచుకుని లోనికి అడుగుపెట్టాడు సారథి.

ఎయిర్‌కండిషన్డ్ కేబిన్ అవటం వలన ఒక్కసారి చల్లని వాతావరణం చుట్టుముట్టింది. రెస్టారెంటులోనికి తొంగి చూశాడు. పాశ్చాత్య సంగీతపు హోరు మధ్యలో 'ట్విస్ట్' డేన్సు చేస్తున్నారు,

చప్పట్లు చరుస్తూ గోలచేస్తున్నారు. వాళ్ళలో ఛీఫ్ ఆఫీసరు ఎక్కడా కను పించలేదు.

మెట్లెక్కి, పై అంతస్థులోనికి వెళ్ళి 'ఛీఫ్' గదిముందు నిలబడి మెల్లగా తలుపు తట్టేడు. తలుపు తెరుచుకుంది.

"హల్లో ఫోర్ మెన్" అంటూ పలుకరించేడు ఛీఫ్. "కమిన్" అన్నాడు గ్రీకు యాస ఇంగ్లీషు పలుకుబడితో.

"షిప్ అన్‌లోడింగ్ కష్టంగావుంది, 'బాలెస్టింగ్' చేయించాలి." అన్నాడు సారథి ఇంగ్లీషులో.

"ష్యూర్! సిడౌన్" అంటూ సారథికి సోఫా చూపించి కాగితంమీద ఏవో అంకెలు వేశాడు. తరువాత 'కేలిక్యు లేటర్' మీద రెండు క్షణాల్లో గుణ కారాలు భాగహారాలు ముగించేడు. ఫోన్‌తీసి ఎవరితోనో గ్రీక్‌లో మాట్లా డేడు.

సారథి గదంతా కలయజూశాడు. పరిశుభ్రంగా, ఎంతో ఆహ్లాదకరంగా వుంది ఆ చిన్నగది. తీర్చిదిద్దినట్లు ఒక మూలగా చిన్నబెడ్, మీద తెల్లని దుప్పటి, మరో మూలగా ఒక టేబిలు రెండు సోఫాలు, గోడకు అమర్చి టేబిలు మీదకు వంగిన చిన్న లేంప్! గోడకు – నగ్నంగా పడుక్కొని వున్న గ్రీక్ అమ్మాయి రంగులచిత్రం అతి కించి వుంది. టేబిలుమీద గ్రీకు మేగ జైన్లు, చిన్న టేపు రికార్డరు, సుమారు పదిదాకా 'కేసెట్లు', సిగరెట్టు పాకెట్లు, ఆష్‌ట్రే, ఒక జత హేండ్ గ్లవ్స్, ముక్కుకు తగిలించుకునే చిన్న 'రెస్పి రేటరు' ఇత్యాదులన్నీ వున్నాయి. బెడ్ మీద పడుక్కుంటే దగ్గరగా కను పించేలా ఫ్రేములో రెండు అందమైన అమ్మాయిల ఫోటోలు వున్నాయి.

'ఛీఫ్ ఆఫీసరు' మాట్లాడ్డం ముగించి ఫోను పెట్టేసి సారథివంక తిరిగాడు.

"ఫోర్ మెన్! విస్కీ తీసుకుంటావా?"

"డ్యూటీలో వుండగా తీసుకోను. థేంక్యూ!" అన్నాడు సారథి చిరు నవ్వుతో.

"గుడ్!" అంటూ క్రింద టేబిలు క్రింద అట్టపెట్టెలోంచి 'వేలెంటైన్' విస్కీ సీసాతీసి ఒక గ్లాసులో ఒంపు కొని ప్లాస్కులోంచి రెండు 'ఐస్ క్యూబ్స్' తీసి అందులో పడేశాడు.

కోకో కోలా టిన్ను మూత తెరిచి సారథి ముందుంచేడు.

"ఆ ఫోటో ఫ్రేముల్లోని అమ్మా యిలు ఎవరు?" సారథి కుతూహలం అణుచుకోలేక 'కోక్' సిప్ చేస్తూ అడిగేడు.

"ఇటు ప్రక్క ఆమె నా మొదటి భార్య. అటువైపు యువతి నా మూడో భార్య."

అర్థంకానట్లు నోరు తెరచుకు చూశాడు సారథి.

అంతలోనే ఛీఫ్ మళ్ళీ అన్నాడు.

"మొదటి ఆమె నాకు విడాకులిచ్చేసింది. అయినా ఆమంటే నాకు చాలా ఇష్టం. అందుకే ఆమె ఫోటో వుంచుకున్నాను. రెండో భార్యతో నాకు సరిపడలేదు. చాలా 'క్రుకెడ్ వుమెన్'! నేనే వది లేశాను. నా మూడో భార్య ప్రస్తుతం నాతో వుంటోంది, 'ఏథెన్స్'లో టీచరుగా పనిచేస్తోంది."

'డన్‌హిల్' సిగరెట్టు పేకెట్ విప్పి సారథికి ఒకటి ఇచ్చి తనొకటి ముట్టించేడు.

సారథికి చాలా ఆశ్చర్యంగా వుంది.

విడాకుల గురించి 'ఛీఫ్' ఎంత తేలిగ్గా మాట్లాడుతున్నాడు!

అసలు పాశ్చాత్య సాంప్రదాయమే అంత! 'విడాకులు' అంటే వాళ్ళ దృష్టిలో చాలా తేలిక! మనుష్యుల మధ్య అనుబంధాలూ తక్కువే!

"నీ భార్య నిన్ను వదిలేసి మరొకడితో వున్నందుకు నీకు బాధగా లేదూ?" అడిగేడు సారథి.

"బాధ ఎందుకు? ఆమెకు ఇష్టమయిన మనిషితో ఆమె ఉంటోంది. కాదనే హక్కు నాకెక్కడిది!"

"మరి పెళ్ళి చేసుకున్నావు కదా! అది హక్కు కాదా? బంధం లేదా?"

"పెళ్ళి ఒక 'సోషియల్ కాంట్రాక్ట్!' అంతే!" తేలిగ్గా అని మొదటి రౌండు విస్కీ ముగించి రెండో రౌండు ఒంపుకున్నాడు గ్లాసులో.

"నీ మొదటి భార్యా, రెండో భార్యా కాపురాలు చేసుకుంటున్నారా?" కోక్ త్రాగటం ముగించి ఖాళీడబ్బా 'డస్ట్‌బిన్'లో పడేస్తూ అడిగేడు సారథి.

"మొదటి భార్య ఏథెన్స్‌లోనే వుంటోంది. ఆమె భర్త డాక్టరు! ఇద్దరు పిల్లలు కూడా వున్నారు. రెండో ఆమె ఫ్రాన్స్ వెళ్ళిపోయిందని విన్నాను. వివరాలు తెలియవు." అన్నాడు.

'చాలా విచిత్రంగా వుంది' అనుకున్నాడు సారథి.

"థేంక్యూ! నేను వెళ్తాను!" అంటూ సోఫాలోంచి లేచి 'గుడ్‌నైట్' చెప్పి బయటకు వచ్చాడు. వాచీ చూసుకున్నాడు. పదింపావు అయింది. ఇంకో నలభై అయిదు నిమిషాల్లో ఈ 'షిప్టు' అయిపోతుంది. వివరాలన్నీ 'లాగ్‌బుక్'లో వ్రాయాలి. 'బ్రేక్‌డౌను' సమయమంతా విడివిడిగా వ్రాసి కారణం రాయాలి. బోలెడు తతంగం! 'డెక్' మీదకు వచ్చేడు సారథి. అవతలి బెర్తు మీద ఆగివున్న 'వార్‌షిప్పు'లో ఏదో సినిమా వేస్తున్నారు. బొమ్మలు అస్పష్టంగా కనుపిస్తున్నాయి. మసగ్గా కదిలిపోతున్నాయి. దూరాన, కొండమీది లైట్‌హౌస్ నిర్విరామంగా తిరుగుతోంది. 'డెక్' చివరకు నడిచేడు! ఆకాశంలో నిండు పున్నమి చంద్రుడు! వెన్నెల నీటిమీద పడి వింతగా ప్రతిఫలిస్తోంది. చిన్న చిన్న కెరటాలు

మెల్లగా కదిలి వెన్నెల నీడల్ని మడతలు పెడుతున్నాయి.

మళ్ళీ దేవకి జ్ఞప్తికి వచ్చింది!

దేవకితో బాటు రాజు కూడా గుర్తుకు వచ్చేడు!

రాజు! ఎంత దుర్మార్గుడు!! దూరపు చుట్టమై తనింటికి వచ్చేడు. దయ్యమై పీడించేడు. రెండు వారాలు తనింట్లో వున్నాడు. వలపన్ని దేవకిని వశం చేసుకున్నాడు. ఆస్తిపాస్తులు ఎరచూపించేడు. మాయచేశాడు! దేవకిని తనకు కాకుండా చేశాడు.

దేవకి తనను మోసంచేసింది, దారుణంగా!

నాలుగు నెలల క్రితం ఓ దినం తెల్లవారేసరికి తన ప్రక్కన దేవకిలేదు.

వీధి గదిలోని రాజుగాడూ కనుపించలేదు. బీరువాలోని అయిదువందల రూపాయలూ కనుపించలేదు! లోకుల నవ్వులు మాత్రం వినిపించేయి. ఇప్పటికీ వినిపిస్తూనే వున్నాయి.

"మీ ఆవిడ కనుపించటంలేదు ఈ మధ్య! ఎక్కడికి వెళ్ళింది?" అని మిత్రులడిగితే సమాధానం చెప్పలేక తల దించుకుంటున్నాడు.

ఛీఫ్ ఆఫీసరు చెప్పినంత తేలిగ్గా తనెందుకు చెప్పలేకపోతున్నాడు?

'తనకిష్టమై ఎవడితోనో లేచిపోయింది. కాదనటానికి నేనెవర్ని?' అని తాను చెప్పగలడా? ఉహూ! చెప్పలేడు! చెప్పకూడదు! ఈ సంఘంలో ఈ వ్యవస్థలో, ఈ రక్తంలో, ఈ గాలిలో వివాహానికి చాలా విలువవుంది. ఈ వ్యవస్థ గురించి తేలిగ్గా మాట్లాడితే జనం హర్షించరు.

ఇప్పటికీ ఛీఫ్ ఆఫీసరు మొదటి భార్యను ప్రేమిస్తూనే వున్నాడు, ఆమెను మరిచిపోలేదు.

తనూ దేవకిని అభిమానిస్తూనే వున్నాడు, ఆమెను మరిచిపోలేక పోతున్నాడు.

వ్యవస్థల్లో తేడాలున్నా ప్రేమలో మాత్రం తేడాలుండవు కాబోలు!

దేవకి ఎలా వుందో!

'ఆమె తిరిగి తనవద్దకు వచ్చేస్తే ఎంత బాగుండును!' అనుకున్నాడు సారథి కెరటాలవంక చూస్తూ.


ఆయిల్ బెర్తు మీది ఓంకరు గట్టిగా కూత పెడుతోంది.

* * *

అదే రాత్రి, అదే సమయంలో—

విజయవాడలోని సత్యనారాయణపురంలోని ఓ పెంకుటింట్లో - ఓ నులక మంచంమీద బోర్లా పడుక్కొని వెక్కి వెక్కి ఏడుస్తోంది దేవకి.

"ఎందుకా దొంగ ఏడుపులు! ఇంతకీ



మధ్యాహ్నం నేను ఇంట్లో లేనప్పుడు వచ్చిన ఆ వెధవెవడు?"

అరుస్తున్నాడు రాజు.

అతని గొంతు కర్కశంగా వుంది, మాటలు తూలుతున్నాయి, మనిషి ఊగుతున్నాడు.

దేవకి ఏడుపు మాని కళ్ళు తుడుచుకుని రాజువైపు కోపంగా చూసింది.

రాజు హేళనగా నవ్వి "ఎందుకలా చూస్తావ్? నువ్వేం సతీసావిత్రివా? అలా కోపంగా చూసినంతలో మాడిపోతానను కున్నావా? అయినా - మొగుణ్ణి మాయచేసి వచ్చేసిన ముండవి - నీకు పాతివ్రత్యం ఏమిటి?" అంటూ గదిలోంచి బయటకు నడిచి విసురుగా అవతల గొళ్ళెం పెట్టేడు.

దేవకి తలుపువంకే చూస్తూ వుండిపోయింది.